
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం, 25, మే, 2024



ఘనంగా క్షీరాభిషేకం
విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. 8లో



శ్రీవారికి వారాంతపు పూజలు
రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. 8లో



కల్యాణం.. కమనీయం
సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి నిత్య కల్యాణం శుక్రవారం విశేషంగా నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

జగనే మళ్లీ సీఎం

- సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి
- బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం నర్సింగరావు

అరకులోయ రూరల్: రాష్ట్రానికి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం నర్సింగరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు జగనన్న నాయకత్వంపై ఎంతో నమ్మకం ఉందన్నారు. ఆయన అందించిన సంక్షేమ పథకాలు వారి గుండెల్లో చెరగని ముద్ర వేశాయన్నారు. అన్ని వర్గాలకు సువర్ణ పాలన అందించారన్నారు.

69 మంది బైండోవర్

- చింతపల్లి ఏఆర్వో రామకృష్ణ

చింతపల్లి రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వచ్చే నెల నాలుగో తేదీన జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ఏఆర్వో టి.రామకృష్ణ తెలిపారు. దీనిలో భాగంగా 69 మందిని బైండోవర్ చేశామన్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష మేర పూచీకత్తు తీసుకున్నట్లు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికల లెక్కింపు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 404 మంది హాజరు

రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరిగిన టెన్త్ సప్లిమెంటరీ మొదటి రోజు పరీక్షలకు 404 మంది హాజరైనట్లు డీఈవో బ్రహ్మాజీరావు తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 730 మంది దరఖాస్తు చేయగా 326 మంది రాలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ



సంతలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

చింతూరు: మండలంలోని ఏడుగురాళ్లపల్లిలోని వారపు సంతలో గిరిజనులు బుధవారం మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. మారుమూల గ్రామాలకు వేస్తున్న రహదారులను, తునికాకు సేకరణను అడ్డుకోవద్దని వారు కోరారు. అమాయక ఆదివాసీలను హత్యచేయడం సరికాదని, తమ రవాణా సౌకర్యానికి ఉపయోగపడుతున్న బస్సులను దగ్ధం చేయవద్దంటూ వారు ర్యాలీ నిర్వహించారు.

మట్టి కుండలకు భలే గిరాకీ

- వేసవి నేపథ్యంలో పెరిగిన ధరలు



భూసిపుట్టు వారపు సంతకు మట్టి కుండలను మోసుకువెళ్తున్న కొండ కుమ్మర్లు

ముంచంగిపుట్టు: వేసవి నేపథ్యంలో మన్యంలోని వారపు సంతల్లో మట్టి కుండలకు గిరాకీ నెలకొంది. తాగునీటికి వినియోగించడంతో వీటి ధరలు కూడా పెరిగాయి. కుండ సైజును బట్టి రూ.60 నుంచి రూ.150 ధరకు విక్రయిస్తున్నారు. మండలంలోని ముంచంగిపుట్టు, లక్ష్మీపురం, భూసిపుట్టు, బంగారుమెట్ట, జోలాపుట్టు గ్రామాల్లో జరిగే వారపు సంతల్లో మట్టికుండల వ్యాపారం జోరందుకుంది. మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామ కుమ్మర్లు మట్టికుండలను తయారు చేసి సంతలకు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. వీరంతా 20 నుంచి 30 కిలోమీటర్ల మేర కాలినడకన తీసుకువస్తుంటారు. మంచి ధర లభిస్తుండటంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కమలానంద భారతి స్వామి ప్రసంగం రేపు

సీతంపేట: ప్రముఖ ఆధ్యాత్మిక గురువు , భువనేశ్వరి పీఠం అధిపతి కమలానంద భారతి స్వామి ఆదివారం ఉదయం శంకరమఠంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేయనున్నట్టు నిర్వాహక కమిటీ తెలిపింది. దేవాలయం కేంద్రంగా ధార్మిక, సామాజిక కార్యక్రమ నిర్వహణ అంశంపై దేవాలయాల ద్వారా సమాజానికి జరగవలసిన సేవలు ,దేవాలయాలలో ఆచరించవలసిన విధులు, విధానాలు, ఆచారాలు వంటి విషయాలను వివరిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రసంగం కొనసాగుతుందని అర్చకులు, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొనవలసిందిగా కోరారు.

పాపికొండలు పర్యాటకం
రయ్‌రయ్..

పాపికొండలు విహారయాత్ర.. ఈ పేరు వినగానే మనసుకు ఒకరకమైన హాయి కలుగుతుంది. గోదావరి అలలపై సాగే పడవ ప్రయాణం జీవితంలో మరపురాని మధురానుభూతి. తక్కువ వెడల్పులో రెండు కొండల మధ్య ప్రవహించే గోదారమ్మ ఒడిలో విహరిస్తూ ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోంది.

- ఏటా భారీగా తరలివస్తున్న పర్యాటకులు
- మూడేళ్లలో 16,300 నుంచి 48,715కు పెరుగుదల
- ఇతర రాష్ట్రాల నుంచి తరలివస్తున్న సందర్శకులు
- ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి



ప్రకృతి అందాల మధ్య గోదావరి అలలపై పాపికొండల విహారయాత్రకు బోటులో బయలుదేరిన పర్యాటకులు

రంపచోడవరం: పాపికొండలు విహారయాత్రకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. గత మూడేళ్లలో వీరి సంఖ్య గణనీయంగా పెరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పాపికొండల అందాలను తిలకించేందుకు భారీగా తరలివస్తున్నారు. ఐదు గంటల పాటు గోదావరి అలలపై సాగే ప్రయాణం పర్యాటకులకు తీపి జ్ఞాపకాన్ని మిగులుస్తుంది.

ప్రతి నిమిషం ఆనందం పంచుతూ..
పర్యాటక బోటు ఎక్కిన దగ్గర నుంచి తిరిగి వచ్చే వరకు ప్రతీ నిమిషం పర్యాటకులకు ఆనందాన్ని పంచుతుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ నేపథ్యంలో సందర్శకులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా పర్యాటకశాఖ పోశమ్మగండి వద్ద బోట్ పాయింట్ ఏర్పాటుచేసింది. గతంలో రాజమహేంద్రవరం, పట్టిసీమ నుంచి బోట్లు బయలుదేరేవి. రాజమహేంద్రవరం నుంచి వాహనాల్లో పోశమ్మగండి వద్దకు పర్యాటకులు చేరుకోవాలి. పోశమ్మ అమ్మవారి దర్శనం అనంతరం బోటుపై పాపికొండలు విహార యాత్రకు బయలుదేరతారు. పాపికొండలు చేరేందుకు,అక్కడి నుంచి తిరిగి వచ్చేందుకు సుమారు ఐదు గంటల సమయం పడుతుంది.

- పోశమ్మ గండి నుంచి బయలుదేరిన వెంటనే నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ కనిపిస్తాయి. తరువాత పోలవరం ముంపులో ఖాళీ చేసిన దేవీపట్నం గ్రామం.. అల్లూరి సీతారామరాజు దాడి చేసిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని చూస్తూ ముందుకు సాగుతుంది ప్రయాణం. ముందుకు వెళ్లేకొద్దీ పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురై ఖాళీ చేసిన గ్రామాలు వరుసగా కనిపిస్తాయి. గోదావరి అందాలను ఆస్వాదిస్తూ సాగుతున్న ప్రయాణానికి మంచి జోష్‌ను నింపేలా ఆట,పాటలతో పర్యాటకులను బోటు నిర్వాహకులు కట్టిపడేస్తున్నారు. కొండమొదలు గ్రామం సమీపించిన తరువాత బోటు నిర్వాహకులు పర్యాటకులకు భోజనం అందిస్తున్నారు.
- పోశమ్మగండి నుంచి బయలుదేరిన బోటు మూడు గంటల అలలపై విహరిస్తూ పేరంటపల్లి చేరుకుంటుంది. అక్కడ ఉన్న శివాలయాన్ని దర్శించుకునేందుకు బోట్ నిర్వాహకులు సుమారు గంట సమయం కల్పిస్తున్నారు. శివాలయంలోకి ప్రవేశించిన తరువాత ఎవరు మాట్లాడకూడదు. అక్కడ నిబంధన. గుడిలో శివనామస్మరణతో గడిపిన క్షణాలు ఎంతో అద్భుతంగా ఉంటాయి. గ్రామస్తులు ఉపాధి కోసం వెదురుతో చేసిన వస్తువులు అమ్ముతారు. వీటిని సందర్శకులు పోటీపడి కొనుగోలు చేస్తుంటారు.

సంవత్సరం	పర్యాటకులు
2021-2022	16,300
2022-2023	26,650
2023-2024	48,715



పేరంటపల్లిలో శివాలయం



ఈవెంట్‌తో ఉపాధి పొందుతున్న యువకులు

ఎంతోమందికి ఉపాధి
బోటు ప్రయాణంలో పర్యాటకులకు జోష్ నింపుతూ **ఎంతో మంది యువకు**లు ఉపాధి పొందుతున్నారు. **ప్రతీ బోటుకు ఈవెంట్** ఆర్గనైజర్లు ఉంటారు. వీరి ఆధ్వర్యంలో యువత షిఫ్టల వారీగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తూ ఆకట్టుకుంటారు. బోటు నిర్వాహకులు ఇచ్చే మొత్తంతోపాటు పర్యాటకులు కూడా తోచిన సాయం అందిస్తున్నారు.

గత మూడేళ్లలో..
పాపికొండల విహారయాత్రకు ఏమాత్రం ఆదరణ తగ్గలేదు. పర్యాటకుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోంది. 2021-2022లో కేవలం 16,300 మంది మాత్రమే సందర్శించారు. 2022-2023లో వీరి సంఖ్య బాగా పెరిగింది. అదనంగా మరో 10,350 మంది అంటే 26,650 మంది సందర్శించారు. 2023-2024లో రికార్డు స్థాయిలో పెరిగింది. సుమారు 48,715 మంది పాపికొండలు అందాలను తిలకించేందుకు వెళ్లారు.

- తెలంగాణ వైపు నుంచి వచ్చే పర్యాటకుల కోసం వీఆర్ పురం మండలం పోచవరం వద్ద ఒక బోట్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు.
- పాపికొండలు పర్యాటకులను తీసుకువెళ్లేందుకు ఏపీ టూరిజం శాఖ ఒక బోటును నడుపుతోంది. ప్రైవేట్ బోటు ఆపరేటర్ల ఆధ్వర్యంలో 14 బోట్లు నడుస్తున్నాయి.



వెదురుతో తయారు చేసిన వస్తువులు

కుటుంబసభ్యులతో వచ్చాం



గోదావరిపై ప్రయాణం ఎంతో హాయిగా సాగింది. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాం. గోదావరిలో బోటుపై ప్రయాణిస్తూ పాపికొండల అందాలను చూస్తూ సాగిన యాత్ర జీవితాంతం గుర్తుండిపోతుంది. గోదావరి అందాలను చూస్తూ సాగే ప్రయాణం ఎప్పటికి మరిచిపోలేం.

– భద్రరావు, గవరవరం, కొయ్యలగూడెం మండలం

ఒక్కసారైనా చూడాల్సిందే



పాపికొండల విహార యాత్ర అద్భుతంగా ఉంది. మొదటిసారి వచ్చాం. ప్రతీ ఒక్కరు ఒక్కసారైన చూడాల్సిన ప్రాంతం. బోట్‌పై గోదావరిపై ప్రయాణం మంచి ఆనందాన్ని ఇచ్చింది. బోట్‌లో యాజమాన్యం ఏర్పాటు చేసిన కల్చరల్ కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

– శ్రీనాథ్, మదనపల్లి, అన్నమయ్య జిల్లా

బాగా ఎంజాయ్ చేశాం



పాపికొండలు విహారయాత్రలో ఊహించిన దానికంటే ఎక్కువగా ఎంజాయ్ చేశాం. ప్రకృతితో మమేకమైయ్యాం. కల్చరల్ టీమ్ పర్యాటకులను ఎంతో ఆనందపరిచారు, మాకు మళ్లీ పెళ్లి చేసి ఎప్పటి మరిచిపోని అనుభూతిని మిగల్చడం ఎంతో సంతోషాన్నిచ్చింది.

– నాగేశ్వరరావు, పర్యాటకుడు, విశాఖపట్నం

ఎంతో సంతోషాన్నిచ్చింది



పోశమ్మ గండి బోట్ పాయింట్ నుంచి పాపికొండలు వెళ్లి.. తిరుగు ప్రయాణంలో అటవీ శాఖ నిర్వహిస్తున్న అతిథి గృహంలో బస చేశాం. సిరివాక ఫారెస్టు గెస్టు హౌస్ చాలా బాగుంది. గోదావరి వ్యూ చూస్తూ గడపడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ప్రతిఒక్కరూ చూడాల్సిందే.

– సంజయ్, పర్యాటకుడు హైదరాబాద్

కేజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంవో సరెండర్

ఇన్‌చార్జి డీసీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ భాస్కరరావు



లక్ష్మీతులసి



భాస్కరరావు

మహారాణిపేట (విశాఖ) : కింగ్ జార్జి ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డి.లక్ష్మీతులసిని శుక్రవారం సరెండర్ చేశారు. ఈ మేరకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 8 నెలల క్రితం కేజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ లక్ష్మీతులసి బాధ్యతలు చేపట్టారు. ఫోరెన్సిక్ విభాగం వైద్యులు కొంత మంది ఆమెపై రాష్ట్ర వైద్య విద్యా డైరెక్టర్ (డీఎంఈ) డాక్టర్ నరసింహానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల చేపట్టిన డీఎంఈ విచారణ చేపట్టారు. డీఎంఈ ఆదేశాల మేరకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ డాక్టర్ లక్ష్మీతులసిని సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వాటిని శుక్రవారం అందజేశారు.

ఇన్‌చార్జి డీసీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ భాస్కరరావు..
డీసీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ ధవళ భాస్కరరావును నియమించారు. ఇప్పటి వరకు ఆయన కేజీహెచ్ ఏఆర్ఎంవోగా పని చేస్తున్నారు. ఇప్పుడు ఇన్‌చార్జి డీసీఎస్ ఆర్ఎంవోగా నియమితులయ్యారు. డాక్టర్ భాస్కరరావు గతంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్తగా పని చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు పోస్టుల్లో ఆయన సేవలందించారు.

ఆర్ఎంపీ క్లినిక్ మూసివేతకు ఆదేశం

గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురంలోని ఆర్ఎంపీ రామ్‌దాస్ క్లినిక్‌ను మూసేయాలని కృష్ణదేవిపేట వైద్యాధికారి హరిప్రవీణ్ శుక్రవారం నోటీసులు జారీ చేశారు. వివరాలివి. లింగంపేట గ్రామానికి చెందిన చెల్లూరి సత్యనారాయణ అనారోగ్యంతో రామ్‌దాస్ వద్దకు వైద్యం కోసం వెళ్లాడు. సరైన వైద్య సేవలు అందించకపోవడంతో సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారి మరణించాడు. దీనిపై కుటుంబ సభ్యులు జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేయగా, నర్సీపట్నం సీనియర్ వైద్యులు ప్రశాంతి గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో రామ్‌దాస్ చికిత్సలో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించారు. దీనిపై జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు ఈ నోటీసులు అందించినట్లు హరిప్రవీణ్ తెలిపారు. తదుపరి ఆదేశాల వరకు క్లినిక్ నిర్వహించరాదని ఆదేశించారు.

భారీ వర్షంతో ఉపశమనం



బంగారుమెట్ట పంచాయతీలో ఉధృతంగా ప్రవహిస్తున్న రెయ్యిలగెడ్డ

ఉధృతంగా వాగులు, గెడ్డలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వరదనీరు భారీగా ప్రవహించింది. జర్రెల పంచాయతీ కేంద్రానికి వెళ్లే మార్గం బురదమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెనుగాలులకు జీడిమామిడికి నష్టం వాటిల్లింది. ఉదయం ఎండ తీవ్రతకు అల్లాడిన జనం వర్షంతో వాతావరణం చల్లబడింది. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు. బంగారుమెట్ట పంచాయతీ రెయ్యిల గెడ్డ వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది.

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా శుక్రవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. మధ్యాహ్నం వరకు భానుడు ప్రతాపం చూపాడు. ఆ తరువాత ఒక్కసారిగా పెనుగాలులతో వర్షం కురిసి వాతావరణం చల్లబడింది.



జి.మాడుగులలో కురుస్తున్న వర్షం

జి.మాడుగులలో పిడుగులతో వర్షం
జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం అయ్యాయి. గెమ్మెలి, వంజరి, సొలభం, నుర్మతి,బొయితిలి, కిల్లంకోట, భీరం, సింగర్భ,నుర్మతి, కోరాపల్లి, గడుతూరు, కె.కోడాపల్లి,లోచలి, వంతాల, కుంబిడిసింగి పంచాయతీల పరిధిలో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి.

14 కేంద్రాల్లో నేడు డిప్యూటీ డీఈవో పరీక్ష

మహారాణిపేట (విశాఖ): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఈవో పరీక్ష శనివారం జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో జరుగుతుందని, మొత్తం 4,498 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. శుక్రవారం తన చాంబర్లో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షను నిర్వహించాలని ఆదేశించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగేందుకు పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవాలని చెప్పారు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎగ్జామినేషన్ సూపరింటెండెంట్ రవి, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు, లైజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల మహిళలకు ఉచిత న్యాయ సహాయం



సదస్సులో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ బాబు



హాజరైన అధికారులు, న్యాయవాదులు

రంపచోడవరం: ఏజెన్సీలోని పేద బడుగు బలహీన వర్గాల మహిళలకు నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని రంపచోడవరం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ పి. బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మహిళలకు ఉచిత న్యాయ సహాయంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలను ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా చేసే వారిని గుర్తించి బాధితులను చట్టపరంగా రక్షించవచ్చన్నారు. రేషన్ , ఆధార్ కార్డులు, ఓటర్ కార్డుల్లేని వారికి లీగల్‌సెల్ ద్వారా తగు న్యాయం చేయవచ్చని తెలిపారు. పిల్లలను స్కూల్‌కు పంపించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలు చెడు వ్యసనాలకు బానిస కాకుండా తండ్రులు ముందుగా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో (జనరల్) సీహెచ్ శ్రీనివాసరావు , రంపచోడవరం సీఐ వాన వెంకటేశ్వరరావు, డీడీ కె. అబుసలాం, వెలుగు ఏపీడీ ఎ. శ్రీనివాసరావు, న్యాయవాదులు ఎంవీఆర్ ప్రకాష్, సత్య ప్రసాద్, టి.వెంకట్రావు, చుక్క సంతోష్ కుమార్, జిలాని, చైతన్య, భగవాన్, వెంకటేశ్వరరావు, తహసీల్దార్లు, సీడీపీవోలు సంధ్యారాణి, ఎంపీడీవో హరికృష్ణ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసుల పరిష్కారం



సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ కేంద్రం శిక్షకులు వీకె బన్సాల్, సునీల్ కుమార్‌లను సన్మానిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

విశాఖ లీగల్: దేశంలోని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో అవసరం అని సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ కేంద్రం శిక్షకుడు వీకే బన్సాల్ అన్నారు. విశాఖ జిల్లా న్యాయస్థానంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన న్యాయమూర్తుల ఐదు రోజుల మీడియేషన్ అండ్ కాన్సిలేషన్ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విశాఖ న్యాయవాదుల సంఘం సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ కేంద్రం శిక్షకులు వీకే బన్సాల్, సునీల్ కుమార్‌లను జిల్లా కోర్టులోని గ్రంథాలయంలో ఘనంగా సన్మానించింది. అనంతరం బన్సాల్ మాట్లాడుతూ విశాఖ న్యాయమూర్తులు, న్యాయవాదుల సహకారం మరువలేనిదన్నారు. సునీల్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌లో న్యాయస్థానాలపై ఒత్తిడి తగ్గించడానికి ప్రతి న్యాయవాది, న్యాయమూర్తి మీడియేషన్ కాన్సిలేషన్ విధానాన్ని పాటించాలన్నారు. వీటికి సంబంధించి పలు అంశాలను సోదాహరించారు. న్యాయ సేవ ప్రాధికార సంస్థ జాతీయ శిక్షకుడు రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడుతూ కేసులు ప్రాథమిక స్థాయిలోనే విచారించి పరిష్కారం దిశగా ఆలోచిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కార్యదర్శి డి.నరేష్, కార్యవర్గ సభ్యులు, ప్రముఖ న్యాయవాది గొలగాని అప్పారావు, డి.హేమమాలిని, సీనియర్ న్యాయవాది కె. శైలేష్, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి(ఇన్‌చార్జి) కె. రాధారత్నం పర్యవేక్షించారు.

రాజభాషా అమలులో వాల్తేర్ డివిజన్‌కు ప్రథమ స్థానం



బహుమతి సాధించిన వాల్తేర్ డివిజన్ అధికారులతో డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం (విశాఖ): రాజభాషా అమలు చేసే ప్రధాన కార్యాలయాల జాబితాలో వాల్తేర్ డివిజన్ 2023–24గాను ప్రథమ బహుమతిని సొంతం చేసుకుంది. వాల్తేర్ డివిజన్‌కు చెందిన ఆరుగురు అధికారుల కృషి ఫలితంగా ఈ బహుమతిని సొంతం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. టీవోఎల్‌ఐసీ విశాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులకు వివిధ హిందీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన వారికి వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్, టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ సౌరబ్‌ప్రసాద్ చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, ఇంచార్జి సెక్రటరీ టీవోఎల్‌ఐసీ/ రాజభాషా అధికారి వీరేంద్ర కాజీ, టీవోఎల్‌ఐసీ మెంబర్ కార్యాలయాల ఉన్నతాధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెంగళూరు–భువనేశ్వర్ మధ్య సమ్మర్ స్పెషల్



తాటిచెట్లపాలెం (విశాఖ): వేసవి రద్దీ దృష్ట్యా ఆయా మార్గాల్లో పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ప్రకటనలో తెలిపారు.

- ఎస్ఎంవీటీ బెంగళూరు–భువనేశ్వర్(06271) సమ్మర్ స్పెషల్ ఈ నెల 31వ తేదీ అర్ధరాత్రి 12.10 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.07 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4 గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది. భువనేశ్వర్–ఎస్ఎంవీటీ బెంగళూరు (06272) సమ్మర్ స్పెషల్ జూన్ 2వ తేదీ ఉదయం 6.30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 2.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 2.10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9 గంటలకు బెంగళూరు వెళ్తుంది.
- ఎస్ఎంవీ బెంగళూరు–సంబల్‌పూర్(06279) సమ్మర్ స్పెషల్ బెంగళూరులో జూన్ 7 అర్ధరాత్రి 12.10 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.07 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 5 గంటలకు సంబల్‌పూర్ వెళ్తుంది. సంబల్‌పూర్–ఎస్ఎంవీ బెంగళూరు(06280) స్పెషల్ జూన్ 8వ తేదీ ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి.. అదే రోజు రాత్రి 9.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.30 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు వెళ్తుంది.

పలు రైళ్ల రీషెడ్యూల్
తాటిచెట్లపాలెం (విశాఖ): పెయిరింగ్ రైళ్ల ఆలస్యం కారణంగా.. ఆయా స్టేషన్ల నుంచి ఆలస్యంగా రైళ్లు బయలుదేరినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 10.15 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు–అగర్తలా (12503) ఎక్స్‌ప్రెస్ సుమారు 27 గంటలు ఆలస్యంగా శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరింది.

- శుక్రవారం ఉదయం 10.35గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు–హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరింది.
- శుక్రవారం ఉదయం 6.30 గంటలకు వాస్కోడగామాలో బయలుదేరాల్సిన వాస్కోడగామా- షాలిమార్ (18048) ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా ఉదయం 8.30 గంటలకు బయలుదేరింది.

ఆన్‌లైన్‌లో ఇంటర్ మూల్యాంకనం!

- సప్లిమెంటరీ పరీక్షలతో ప్రయోగాత్మకంగా అమలు
- సకాలంలో ఫలితాలు ఇచ్చేలా కార్యాచరణ
- అధ్యాపకులకు తొలగనున్న స్పాట్ ఇబ్బందులు
- బోధనకు ఆటంకం లేకుండా ఏర్పాట్లు
- భారీగా తగ్గనున్న స్పాట్ వాల్యుయేషన్ ఖర్చు
- ఉత్తరాంధ్రలోని ఐదు జిల్లాలకు విశాఖలో స్కానింగ్ సెంటర్



విశాఖ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్కానింగ్ సెంటర్

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం జరుగుతున్న సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనాన్ని ఆన్‌లైన్ విధానంలో చేపట్టాలని నిర్ణయించిన ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు.. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. అసిస్టెంట్ ఎగ్జామినర్(ఏఈ)గా నియమితులైన అధ్యాపకుడు జూనియర్ కాలేజీల్లో తన రోజు వారీ విధులు నిర్వహిస్తూనే.. పనిచేసే కాలేజీలో లేదా ఇంటి వద్ద జవాబు పత్రాలను మూల్యాంకనం చేయవచ్చు. ఇంటర్మీడియట్ కాలేజీల్లో విద్యా బోధనకు ఆటంకం లేకుండా బోర్డు ఉన్నతాధికారులు ప్రయోగాత్మకంగా 'ఆన్‌లైన్ మూల్యాంకనం'విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని వల్ల స్పాట్ వాల్యుయేషన్ ఖర్చు సైతం తగ్గనుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏటా స్పాట్ నిర్వహణలో సుమారు రెండు వేల మంది అధ్యాపకుల విధుల్లో పాల్గొంటారు. దీని కోసం రూ.3 కోట్లు వ్యయం చేస్తుండగా.. ఆన్‌లైన్ విధానంలో ఇది సగానికి తగ్గనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మూల్యాంకనం ఎలా చేస్తారంటే..

స్కానింగ్ చేసిన జవాబు పత్రాలను అసిస్టెంట్ ఎగ్జామినర్(ఏఈ)గా ఎంపిక చేసిన అధ్యాపకుడికి ఆన్‌లైన్‌లో పంపిస్తారు. ప్రత్యేకంగా కేటాయించే కోడ్ ఆధారంగా కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్‌లో ఓపెన్ చేసి తాను పనిచేసే కాలేజీ లేదా ఇంటివద్ద జవాబు పత్రాలను మూల్యాంకనం చేయవచ్చు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎప్పుడైనా జవాబు పత్రాలను దిద్దవచ్చు. అయితే తప్పనిసరిగా సీసీ కెమెరా పర్యవేక్షణలోనే ఈ ప్రక్రియ అంతా జరగాలి. రోజుకు 60 పేపర్ల వరకు మూల్యాంకనం చేసేందుకు అవకాశం కల్పిస్తారు. ఎగ్జామినర్ మూల్యాంకనం సవ్యంగా చేశారా లేదా అనేది చీఫ్ ఎగ్జామినర్(సీఈ) పరిశీలించనున్నారు.

పారదర్శకతకు పెద్ద పీట

ఆన్‌లైన్ విధానంలో జరిగే మూల్యాంకనం ప్రక్రియ ఎంతో పారదర్శకతతో కూడినదని అధికారులు చెబుతున్నారు. 24 పేజీల గల ఓ సబ్జెక్టు జవాబు పత్రాన్ని పూర్తి స్థాయిలో మూల్యాంకనం చేస్తేనే, ఎగ్జామినర్ కంప్యూటర్ లాగిన్ క్లోజ్ చేసే అవకాశం ఉంటుంది. పొరపాటున ఏ ఒక్క పేజీ దిద్దకపోయినా.. కంప్యూటర్‌లో రెడ్ సింబల్‌తో దాన్ని చూపిస్తోంది. అంతేకాకుండా ఎగ్జామినర్ చేసిన మూల్యాంకనంను చీఫ్ ఎగ్జామినర్, అదే విధంగా ఉన్నతాధికారులు సైతం పరిశీలన చేయనున్నారు. పారదర్శకతతో కూడిన మూల్యాంకనంతో పాటు ఫలితాలను సకాలంలో ప్రకటించే అవకాశం ఉంటుంది.

అధ్యాపకులకు తొలగనున్న స్పాట్ ఇబ్బందులు

స్పాట్ వాల్యుయేషన్ విధులంటే అధ్యాపకులు నిరాసక్తత వ్యక్తం చేస్తారు. దూరాభార ప్రయాణంతో పాటు మండుటెండలో రోజంతా స్పాట్ సెంటర్‌లో విధులంటే అమ్మో అంటూ విధులను తప్పించుకునేందుకు ప్రయత్నాలూ జరుగుతున్నాయి. అంతేకాకుండా స్పాట్ విధులతో కాలేజీల్లో బోధనకు సైతం ఆటంకం ఏర్పడేది. ఆన్‌లైన్ విధానంలో అధ్యాపకులు ఎంచక్కా రోజువారీ విధులు నిర్వహిస్తూనే రోజులో ఏదో ఒక సమయంలో కేటాయించిన జవాబు పత్రాలను మూల్యాంకనం చేసేలా అవకాశం ఉంటుందని ఇంటర్ బోర్డు ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్ఐవో, విశాఖ క్యాంప్ ఇన్‌చార్జి పి.మురళీధర్ తెలిపారు.

ఐదు జిల్లాలకు విశాఖలో కేంద్రం


ఆన్‌లైన్ మూల్యాంకనంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, కర్నూలులో స్కానింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి విశాఖ జైల్ రోడ్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ అత్యాధునిక టెక్నాలజీ కూడిన 52 కంప్యూటర్ కమ్ స్కానింగ్ పరికరాలను అమర్చారు. ఐదు జిల్లాల నుంచి వచ్చే జవాబు పత్రాలను ఎప్పటికప్పుడు స్కానింగ్ చేసేందుకు 60 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు.

క్లుప్తంగా

శ్రీవారికి వారాంతపు పూజలు

కొమ్మాది (విశాఖ): రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. ముందుగా శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహించి, శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వ్యక్తి అదృశ్యం



మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన వెలుగుచూసింది. వివరాలిలా.. నాగేశ్వరరావు అనే వ్యక్తి జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌లో లైసెన్స్ కూలీగా పనిచేస్తుంటాడు. ఇతడు భార్య, కుమార్తెతో కలిసి మధురవాడలో నివసిస్తున్నాడు. ప్రస్తుతం అనారోగ్యం కారణంగా తాటిచెట్లపాలెం సంజీవయ్య కాలనీలో ఉంటున్న అతడి సోదరుడు ఇంటి వద్ద నుంచి పనికి వెళ్తున్నాడు. ఈ నెల 18న పనికి వెళ్లి వస్తానని చెప్పి సోదరుడి ఇంటి వద్ద నుంచి నాగేశ్వరరావు బయలుదేరి వెళ్లి తిరిగి రాలేదు. అంతటా వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో అతడి సోదరుడు త్రిమూర్తులు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ వి.వి.రమణ కేసు దర్యాప్తు చేపట్టారు. నాగేశ్వరరావు ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

వెంకన్నకు వైభవంగా పుష్పాంజలి సేవ

- వేడుకగా ఊంజల్ సేవ

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం పుష్పాంజలి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచి బారులు తీరారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో దేవాలయాన్ని రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. ఆలయ మండపంలో అష్టదళ పద్మారాధన, పాలికా ఉద్వాసన, ద్వాదశార్చనలు, విశేష నివేదనలు, ఆలయ ప్రాంగణ ప్రదక్షిణలు చేపట్టారు. అనంతరం అర్చక స్వాములు నిర్వహించిన పూబంతుల ఆట భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామికి నివేదించిన విశేష హారతులు భక్తులను అలరించాయి. అనంతరం స్వామివారి పవళింపు సేవ కనుల పండువగా చేపట్టారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కీర్తనలు, గోవింద నామాలతో బల్లిగిరి మార్మోగింది. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పాయకరావుపేట: రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందినట్లు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. పట్టణంలోని ఇందిరాకాలనీ రైల్వే బ్రిడ్జి సమీపాన శుక్రవారం మధ్యాహ్నం విశాఖ నుంచి విజయవాడ వెళ్తున్న గుర్తు తెలియని రైలు నుంచి సుమారు 40 సంవత్సరాల వయసున్న వ్యక్తి జారిపడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడు స్కై బ్లూ కలర్ జీన్ ఫ్యాంటు, స్లీవ్‌లెస్ బనియన్ ధరించి ఉన్నాడన్నారు. అతని వద్దనున్న ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపర్చి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక సాయం చేయండి



కేంద్ర ఆర్థిక కార్యదర్శి సోమనాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీవీఎల్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.3,110 కోట్ల ఆర్థిక సాయం అందించాలని రాజ్యసభ ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి డాక్టర్ టి.వి. సోమనాథన్‌ను కోరారు. శుక్రవారం ఆయన న్యూఢిల్లీలో కార్యదర్శిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ వెలుపల, కంపెనీ నియంత్రణలో లేని ఇతర కారణాల వల్ల ప్లాంట్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడానికి స్టీల్‌ప్లాంట్‌కు రూ. 3,110 కోట్లను ప్రాధాన్యత షేర్ల రూపంలో ఇవ్వాలని కోరారు. 2002లో నాటి ప్రధాని వాజ్‌పేయ్ ప్రభుత్వం అందించిన మద్దతును గుర్తు చేస్తూ.. స్టీల్‌ప్లాంట్ 2011–16 మధ్య కేంద్ర ప్రభుత్వానికి రూ.2,937 కోట్లు తిరిగి చెల్లించిందన్నారు. స్టీల్‌ప్లాంట్ నికర విలువ పెంచడానికి భూమి యాజమాన్యానికి బదలాయించడం, వివిధ వనరుల ద్వారా అదనంగా రూ.4 వేల కోట్లు సమకూర్చే అవకాశం కల్పించాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై ఆర్థిక శాఖ కార్యదర్శి సోమనాథన్ సానుకూలంగా స్పందించారని జీవీఎల్ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో 41.1 కేజీల గంజాయి స్వాధీనం

జీఆర్పీ అదుపులో గంజాయి రవాణాదారుడు



గంజాయి రవాణాదారుడితో జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాల్లో శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన బస్వా అప్పారావు వద్ద నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు రూ.2.05 లక్షల విలువైన 41.1 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇతడిని అదుపులోకి తీసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

దేవరాపల్లిలో చెరకు తోట దగ్ధం

దేవరాపల్లి: అగ్ని ప్రమాదంలో చెరకు తోట దగ్ధమైంది. రూ. 2 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. శుక్రవారం మధ్యాహ్నం దేవరాపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. రైతు కొల్లి దొంగబాబుకు చెందిన 50 సెంట్లలో చెరకు తోట కాలిపోతున్న సమయంలో రైతులు ఎవరూ లేకపోవడంతో మంటలను అదుపు చేసే పరిస్థితి లేకుండా పోయింది. చెరకు తోటతోపాటు సాగు నీరందించే పైపులు సైతం కాలి బూడిదైనట్టు బాధిత రైతు బోరున విలపించాడు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

తోట చెరువులో వ్యక్తి మృతదేహం

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

యలమంచిలి రూరల్: మండలంలోని తందాలదిబ్బ కూడలికి సమీపంలో ఉన్న తోట చెరువులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడినట్లు యలమంచిలి రూరల్ పోలీసులు మీడియాకు తెలిపారు. చెరువులో మునిగేంత నీరు లేకపోయినా వ్యక్తి ఎలా చనిపోయాడన్న దానిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం బాగా కుళ్లిపోయి, దుర్వాసన వస్తోంది. నాలుగు రోజుల క్రితమే చెరువులో మృతదేహం పడి ఉండవచ్చని గుర్తించిన పోలీసులు, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి యలమంచిలి సీఐ షేక్ గఫూర్, కొక్కిరాపల్లి గ్రామస్తులు తెలిపిన వివరాలు. కొక్కిరాపల్లి గ్రామపరిధి ప్రేమ సమాజం సమీపంలో ఉన్న తోట చెరువులో శుక్రవారం చేపలు పట్టేందుకు కొందరు వ్యక్తులు వెళ్లారు. వారికి చెరువులో సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం కనిపించింది. వెంటనే స్థానిక వార్డు కౌన్సిలర్ మజ్జి రామకృష్ణకు చెప్పగా, ఆయన పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు పరిసరాలతో పాటు మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతదేహం బాగా కుళ్లి, ఉబ్బిపోయింది. మృతుడి ఫ్యాంటు ఊడిపోయి ఉండటం, చెరువులో పెద్దగా నీరు లేకపోవడం, శరీరంపై గాయాలు ఉండటంతో ఎవరైనా హత్య చేసి ఉండవచ్చన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని అనకాపల్లి మార్చురీలో భద్రపరిచారు. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మిస్సింగ్ కేసుల వివరాలను పరిశీలిస్తున్నట్లు సీఐ గఫూర్ తెలిపారు.

పాలిటెక్నిక్, గైస్‌కు ఎన్‌బీఏ గుర్తింపు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ(నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు లభించింది. జాతీయ స్థాయిలో సాంకేతిక కళాశాలకు డిప్లమో స్థాయిలో ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మక ఎన్‌బీఏ గుర్తింపు లభించడం ఇదే మొదటిసారి అని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు కాలేజీ యాజమాన్యం ఎన్‌బీఏ గుర్తింపునకు అవసరమైన చర్యలు తీసుకుంది. ఇటీవల ఎన్‌బీఏ ప్రతినిధులు కాలేజీ సాధించిన ప్రగతి, క్రీడా సౌకర్యాలు, భవన సముదాయాలు, ప్రయోగశాలలు, సాంకేతిక విధానాల అమలు వంటి అంశాలను నిశితంగా పరిశీలించారు. ఈ మేరకు కళాశాలలోని మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెటలర్జీ విభాగాలకు 2027 జూన్ 30వ తేదీ వరకు ఎన్‌బీఏ గుర్తింపు మంజూరు చేసింది. ఎన్‌బీఏ గుర్తింపు సాధించడం కాలేజీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ సంతోషం వ్యక్తం చేశారు.

- కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)కు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఈ కాలేజీలో నాలుగు బ్రాంచీలు ఉండగా వీటిలో కెమికల్ ఇంజినీరింగ్, పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపునకు దరఖాస్తు చేశారు. ఇటీవల ఎన్‌బీఏ ప్రతినిధులు కాలేజీని సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. ఈ మేరకు ఈ రెండు విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు మంజూరు చేశారు. ఈ గుర్తింపు 2027 జూన్ 30 వరకు అమలులో ఉంటుంది. మిగతా విభాగాలకు కూడా త్వరలో ఎన్‌బీఏ గుర్తింపునకు వెళ్తామని ప్రిన్సిపాల్ వెంకటరమణ చెప్పారు. ఇందుకు సహకరించిన సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి, సెక్రటరీ కె.రమణబాబు, జాయింట్ డైరెక్టర్ వి.పద్మారావుకు రెండు కళాశాలల ప్రిన్సిపాళ్లు ధన్యవాదాలు తెలిపారు. ఎన్‌బీఏ గుర్తింపునకు కృషి చేసిన వివిధ శాఖల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బందిని అభినందించారు. ఎన్‌బీఏ గుర్తింపు లభించడం వల్ల ఈ కళాశాలల్లో చదివే విద్యార్థుల డిప్లమో సర్టిఫికెట్‌కు ప్రపంచవ్యాప్త గుర్తింపుతో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని వారు వివరించారు.

ఘనంగా క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 0608100 11006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

కంటెయినర్ ఢీకొని వివాహిత దుర్మరణం

కుమార్తె కాలేజీ ఫీజు చెల్లించడానికి వచ్చి మృత్యువాత



బైక్‌ను ఢీకొట్టిన కంటెయినర్

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం జాతీయరహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా ఎల్.కోటకు చెందిన సావర్ల నవ్య అనే వివాహిత మృతి చెందింది. ఆనందపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెద్దిపాలెం నారాయణ కళాశాలలో నవ్య కుమార్తె ఝాన్సీ చదువుతోంది. కుమార్తె ఫీజు చెల్లించడానికి గానూ కుమారుడు రాజు, కుమార్తెతో కలిసి ఆమె ద్విచక్రవాహనంపై పెద్దిపాలెం వస్తోంది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి రాంచీ వెళుతున్న చాక్లెట్ల కంటెయినర్ గోకార్టింగ్ సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవ్య అక్కడికక్కడే మృతి చెందగా.. రాజు, ఝాన్సీ గాయపడ్డారు. ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ సునీల్ ఫిర్యాదుతో సీఐ టి.తిరుపతిరావు కేసు నమోదు చేస్తున్నారు.

చేపల లోడుతో లారీ బోల్తా



లోడుతో విడిపోయిన లారీ భాగం

తగరపువలస: ఆనందపురం మండలం జాతీయ రహదారిపై ఎస్ఎస్ఆర్ఐటీ కళాశాల ఎదురుగా శుక్రవారం వేకువజామున చేపల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో కేబిన్‌తో లారీ పైభాగం విడిపోయింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. వివరాలివీ.. తమిళనాడులోని నారాయణపురం నుంచి బిహార్‌కు వెళ్తున్న లారీ వేకువజామున 4.30 ప్రాంతంలో డ్రైవర్ నిద్రమత్తు కారణంగా డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో లారీ బోల్తా పడి కేబిన్, లోడు విడిపోయి రహదారిపై వేరువేరుగా పడిపోయాయి. చేపల లోడును తాళ్లు, పరదాలతో కట్టుదిట్టంగా కట్టివేయడంతో ఏ నష్టం జరగలేదు. ఆ సమయంలో ట్రాఫిక్ కూడా ఎక్కువగా లేకపోడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకున్న ఆనందపురం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాద వివరాలు సేకరించారు.

